
నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 4 జూన్ 2025 | KAMAREDDY

## పైన పటారం..లోన లొటారం..

ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం పైన పటారం లోన లొటారం చందంగా మారింది. చూడడానికి కార్పొరేట్ హంగులు, ఆర్భాటాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ వైద్య సేవల్లో మాత్రం నాణ్యత కనిపించడం లేదు. విపరీతమైన పీఆర్ నెట్వర్క్‌ను ఏర్పాటు చేయించుకుని రోగులను ఇబ్బడి ముబ్బడిగా ఇన్ పేషెంట్లుగా చేర్చుకుంటున్నారు. చిన్న సమస్యతో వస్తే నానా రకాల భయాలు జొప్పించి రూ.లక్షల్లో బిల్లులు వేసి జేబులు గుల్లా చేస్తున్నారు. కొన్ని కేసుల్లో చిన్నపాటి సమస్యతో వస్తే ఏకంగా ప్రాణాలే పోతున్నాయి. ఇలాంటి ఘటనలు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని ప్రైవేటు దవాఖానల్లో తరచూ వెలుగు చూస్తున్నాయి. వెన్నుపూస శస్త్ర చికిత్స కోసం వచ్చిన ఓ మహిళ మృతి చెందిన ఘటన వెలుగు చూడడంతో ఇప్పుడు మరోసారి ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో ఏం జరిగిందో ఏమో కాని ప్రైవేటు దవాఖానల్లో కాలు పెట్టాలంటేనే జనాలు జంకే పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు దవాఖానల ఆగడాలపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు చొరవ తీసుకుని తనిఖీలకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సాధారణ ప్రసవాల విషయంలో పూర్వ కలెక్టర్ నారాయణ రెడ్డి అద్భుతమైన చొరవ తీసుకున్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి దవాఖాన నిర్వాహకులను దారికి తీసుకువచ్చారు. నారాయణ రెడ్డి మాదిరిగా ప్రస్తుత కలెక్టర్ స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజలకు మేలు చేసే విధంగా ప్రైవేటు దవాఖానలకు ముకుతాడు వేసి తనదైన మార్క్‌ను చూపించాలని వేడుకుంటున్నారు.

- నాణ్యత లేని వైద్యసేవలు
- తరచూ వెలుగుచూస్తున్న వైద్యం వికటిస్తున్న ఘటనలు
- గాల్లో రోగుల ప్రాణాలు.. పట్టించుకోని అధికారులు
- తూతూ మంత్రంగా విచారణ.. కానరాని చర్యలు
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలని ప్రజల వేడుకోలు





ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు


# ప్రైవేట్ దగాఖానలు

ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ దవాఖానలు పుట్టగొడుగుల్లో పుట్టుకొస్తున్నాయి. ఎత్తయిన భవనాల్లో అత్యాధునిక పరికరాలు, అన్ని హంగులతో దవాఖానలు ఏర్పాటు చేస్తూ వైద్య సేవలను ఖరీదుగా మార్చారు. పెద్ద మొత్తంలో ఫీజులు వసూలుచేస్తున్నా సకాలంలో వైద్యం అందించకపోవడంతో పాటు వైద్యం వికటిస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. దీంతో సామాన్యులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. ఉమ్మడి జిల్లాలో ఇటీవల నకిలీ వైద్యులు పట్టుబడగా.. తాజాగా అర్హత, శిక్షణ లేనివారు వైద్యం చేయడంతో రోగులు మృత్యువాత పడిన ఘటనలు వెలుగుచూశాయి.

– నిజామాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ఉమ్మడి జిల్లాలో నకిలీ వైద్యుల కలకలం రేగగా.. చాలా చోట్ల వైద్యం చేస్తున్న వ్యక్తులకు సరైన అర్హతలు ఉండడంలేదు. తమకు సంబంధంలేని, అవగాహన, నైపుణ్యం లేని అంశంలో జోక్యం చేసుకుంటుండడం రోగుల ప్రాణాల మీదికి తెస్తున్నది. ఉదాహరణకు శస్త్ర చికిత్సకు ముందు రోగికి మత్తు మందును సంబంధిత విభాగంలోని నిపుణులే రోగి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేసి సరైన డోసును అందిస్తారు. కానీ నిజామాబాద్‌లో ఇందుకు విరుద్ధంగా మత్తు మందు ఎక్కిస్తున్నారు. ఇష్టమొచ్చినట్లుగా ఇతర విభాగాలకు చెందిన డాక్టర్లే మత్తు మందు సూదిని చేత బడుతున్నారు. ఎంత మొత్తంలో, ఏ మోతాదులో ఇస్తున్నారో అర్థం కాని పరిస్థితి. ప్రస్తుతం మత్తు మందు డాక్టర్ల కొరత విపరీతంగా వేధిస్తున్నది. ఈ మధ్య కాలంలోనే పేరుమోసిన మత్తు మందు డాక్టర్ కూడా హైదరాబాద్‌కు మకాం మార్చారు. దీంతో అందుబాటులో ఉండే వారి సంఖ్య ఒకరిద్దరకన్నా ఎక్కువగా లేదు. అలాంటప్పుడు రోజుకు పదుల సంఖ్యలో జరుగుతున్న ఆపరేషన్లకు మత్తు మందు ఇస్తున్నదెవరు? అన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. చాలా ఆపరేషన్లలో మత్తు మందు డోస్ ఎక్కువ కావడం, సరైన మోతాదులో ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తిన సందర్భాలు అనేకం ఉన్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. హోదా ఒకటుంటే దవాఖాన లోపల మరో చికిత్స అందిస్తున్నారు. రికార్డుల్లో మాత్రం పేర్లను తారుమారు చేసి రాస్తున్నట్లుగా తెలుస్తున్నప్పటికీ వైద్యారోగ్య శాఖ తనిఖీ బృందాలకు ఇవేమీ కనిపించకపోవడం గమనార్హం.

## వైద్యారోగ్య శాఖ లోపాల పుట్ట




నిజామాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ లోపాల పుట్టగా మారింది. తనిఖీలు లేకపోవడంతో ప్రైవేటు దవాఖానల్లో దోపిడీ తంతుకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. దీంతో సామాన్యులు దోపిడీకి గురవుతున్నారు. అసలు ప్రైవేట్ దవాఖానల్లో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. వైద్య సేవల్లో లోపాలు బహిర్గతమైతే సామాన్యులకు అనేక చట్టాలు అనుకూలంగా ఉన్నాయి. వైద్య నిర్లక్ష్యంతో ప్రాణ నష్టం జరిగినట్లు ఫిర్యాదు అందిన వెంటనే తెలంగాణ వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో స్వతంత్ర విచారణ సంఘం ఏర్పాటు చేయాలి. ఈ సంఘం దవాఖాన రికార్డులు, చికిత్స ప్రక్రియ, సిబ్బంది నిర్వహణను పరిశీలిస్తుంది. ఆరు రోజుల క్రితం వివాహిత మృతి కేసులో డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో పరిశీలన చేపట్టారు. దవాఖాన లైసెన్స్, వైద్య సౌకర్యాలు, సిబ్బంది అర్హతలను ఈ విచారణ కమిటీ తనిఖీ చేస్తుంది. నిర్లక్ష్యం నిరూపితమైతే, దవాఖాన లైసెన్స్ సస్పెండ్ చేయవచ్చు. జరిమానా కూడా విధించవచ్చు. ఆరోగ్య శ్రీ లేదా ఇతర ప్రభుత్వ పథకాల కింద చికిత్స జరిగినతే ఆరోగ్య శ్రీ ట్రస్ట్ లేదా జిల్లా వైద్యారోగ్య శాఖలో ఫిర్యాదు నమో దు చేయవచ్చు. వైద్య సిబ్బంది ఈ అంశంలో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్, బదిలీ లేదా శాఖాపరమైన చర్యలు తీసుకోవచ్చు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 106(1) ప్రకారం ఎవరైనా నిర్లక్ష్యం లేదా హఠాత్తు చర్య వల్ల మరణం సంభవిస్తే ఏడేండ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు.

### వైద్యసేవల్లో లోపాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు



"ప్రైవేటు దవాఖానల్లో వైద్యంవల్ల ఎవరికైనా ఇబ్బందులు తలెత్తినా, లోపాలు వెలుగు చూసినా వైద్యారోగ్య శాఖకు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టి సదరు ప్రైవేటు దవాఖానపై చర్యలు తీసుకుంటాం. డాక్టర్ లైసెన్సు రద్దు కోసం చర్యలు కూడా చేపడతాం. ఈమధ్యే చోటుచేసుకున్న ఓ వివాహిత మృతిపై మాకు ఇప్పటి వరకు ఫిర్యాదు రాలేదు. అసలు ఏం జరిగిందో తెలుసుకునేందుకు మా నిపుణుల బృందం దవాఖానకు వెళ్లి పూర్తి వివరాలను సేకరిస్తున్నది."

- రాజశ్రీ, వైద్యారోగ్య శాఖ అధికారిణి, నిజామాబాద్ జిల్లా




## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు



డిచ్‌పల్లి మండలం సుద్దులంలో నిర్వహించిన సదస్సులో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

డిచ్‌పల్లి/ధర్పల్లి/మాచారెడ్డి, జూన్ 3 : భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. డిచ్‌పల్లి మండలం సుద్దులం, ధర్పల్లి మండలం గోవింద్‌పల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో నిజామాబాద్ కలెక్టర్ పాల్గొని రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూభారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఆగస్టు 14లోగా భూభారతి కింద వచ్చిన అన్ని అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్‌తండాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ హాజరయ్యారు. మండల కేంద్రంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు.

## ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, జూన్ 3: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి మంగళవారం 672 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు)కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1062.20 అడుగుల (12.788టీఎంసీలు)నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 341 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వెళ్తున్నది.

# మృత్యువులోనూ వీడని బంధం

- నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యం
- ఈత కోసం వెళ్లి మృత్యువాత
- వెలికితీసిన పోలీసులు, అగ్నిమాపక రెస్క్యూ బృందం
- శోకసంద్రంలో కుటుంబీకులు, బంధువులు
- బాధితులకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతదేహాలను బయటికి తీసిన అనంతరం పంచనామా చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 3: నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో సోమవారం ఈతకోసం వెళ్లి గల్లంతైన ముగ్గురు యువకుల మృతదేహాలు మంగళవారం మధ్యాహ్నం లభ్యమయ్యాయి. సోమార్‌పేట్ అటవీ ప్రాంతంలోని నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో సోమవారం సాయంత్రం ఈతకు వెళ్లిన సోమార్‌పేట్ గ్రామానికి చెందిన బెస్త హర్షవర్ధన్ (17), ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన ఐత నవీన్ (23), నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావ్ పల్లికి చెందిన కల్లేటి మధుకర్‌గౌడ్(16) గల్లంతైన విషయం తెలిసిందే. స్థానిక పోలీసులు, అగ్నిమాపక రెస్క్యూ టీం, గజ ఈతగాళ్ల సమన్వయంతో సోమవారం రాత్రి 8 నుంచి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు గాలింపు చర్యలు చేపట్టగా ముగ్గురి మృతదేహాలు బయటికివచ్చాయి. ప్రాజెక్ట్ లోపల కొద్ది దూరంలో బురద గుంతలో మధుకర్ గౌడ్ మృతదేహం లభ్యంకాగా, నవీన్ మృతదేహం పదకొండున్నర గంటలకు బయటికి వచ్చింది. ఒంటి గంట పదినిమిషాలకు బెస్త హర్షవర్ధన్ మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు తీసుకువచ్చారు. క్రికెట్ ఆడిన స్నేహితులంతా స్నానాల కోసం నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లోకి వెళ్లగా ముగ్గురు యువకులు లోనికి వెళ్లి మునిగిపోయారు.

### ప్రథమున్ని కోల్పోయిన కుటుంబాలు

మృతిచెందిన ముగ్గురు యువకులు వయస్సులో కొంచెం తారతమ్యం ఉన్నా, బాగా స్నేహం వీరి మధ్య ఉండేదని తెలుస్తోంది. మధుకర్‌గౌడ్‌ది 9వ తరగతి పూర్తికాగా, బెస్త హర్షవర్ధన్ ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తయింది. ఐత నవీన్ శివ్వానగర్ గ్రామంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ముగ్గురు క్లాస్‌మెట్స్ కాకున్నా వారిని క్రికెట్ స్నేహితులుగా మార్చింది. మామూలు సమయంలో కూడా ముగ్గురు ఎంతో స్నేహంగా ఉండేవారని తోటి స్నేహితులు తెలిపారు. అనునిత్యం స్నేహంగా ఉంటూ చావులోనూ ఒకటిగా వెళ్లిపోయారని స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతిచెందిన నవీన్ తల్లిదండ్రులకు ఒకే ఒక్క కుమారుడు, హర్షవర్ధన్ సైతం ఒక్క కుమారుడు కాగా, అతనికి ఒక చెల్లెలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే మధుకర్ తల్లిదండ్రులకు మధుకర్ పెద్ద కుమారుడు కాగా అతనికి తమ్ముడు ఉన్నట్లు తెలిసింది. మూడు కుటుంబాల్లో ప్రథమ పుత్రుడిని కోల్పోవడంతో విషాదం నెలకొన్నది. చేతికందివస్తున్న కొడుకులు మృత్యువాతకు గురికావడం ఆ తల్లిదండ్రులకు తీరని పుత్రశోకాన్ని మిగిల్చింది.

### బాధితులకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ముగ్గురు యువకులు నీట మునిగి మృత్యువాతకు గురైన విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. దవాఖానలో మృతదేహాలను సందర్శించారు. అనంతరం ఇండ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు నునుగొండ శ్రీనివాస్, మంచిర్యాల విద్యాసాగర్, కుర్మ సాయిబాబా బాధిత కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. మృతదేహాలకు ఎల్లారెడ్డిప్రభుత్వ వైద్యశాలలో సాయంత్రం పోస్ట్‌మార్టం నిర్వహించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు సాయంత్రం వారి అంత్యక్రియలను నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నిజాంసాగర్ పోలీసులు తెలిపారు.



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

# పరేషన్

- మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ
- దుకాణాల వద్ద బారులు తీరుతున్న లబ్ధిదారులు



వర్ని రోడ్‌లోని రేషన్ షాపు వద్ద టెంట్ ఏర్పాటు చేయకపోవడంతో చెట్లకింద కూర్చున్న లబ్ధిదారులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇస్తుండడం లబ్ధిదారులకు కొత్త కష్టాలను తెచ్చిపెట్టింది. గత నెల వరకు పదిహేను నిమిషాల్లో బియ్యం తీసుకోగా.. ఇప్పుడు గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నగరంలో రేషన్ దుకాణాల వద్ద ఉదయం నుంచే బారులు తీరుతున్నారు. కొందరు నిలబడలేక క్యూలో సంచులను ఉంచుతున్నారు. రేషన్ కేంద్రాల వద్ద కనీసం టెంట్‌కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, మహిళలు నీడ కోసం చెట్లను ఆశ్రయిస్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని కెనాల్ కట్ట రేషన్ దుకాణం వద్ద క్యూలో ఉంచిన సంచులు



దుబ్బ ప్రాంతంలో ఉదయం 10 గంటలైనా రేషన్ షాపు తెరవకపోవడంతో వేచిచూస్తున్న లబ్ధిదారులు




నాందేవ్‌వాడ రేషన్ దుకాణం వద్ద పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

# అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్టు

- 39 దొంగతనాలకు పాల్పడిన గ్యాంగ్
- 15 తులాల బంగారు నగలు, నాలుగు వాహనాలు స్వాధీనం
- సీపీ సాయి చైతన్య వెల్లడి



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న నిజామాబాద్ సీపీ సాయి చైతన్య

వినాయక్‌నగర్, జూన్ 3: నిజామాబాద్ జిల్లాతో పాటు హైదరాబాద్ జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను ఎట్టకేలకు పోలీసులు పట్టుకొన్నారు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఓ పాత నేరస్తుడు నిజామాబాద్ నగరానికి చెందిన ఏడుగురు సభ్యులను తన ముఠాలో చేర్చుకొని, వారితో కలిసి వరుసగా చోరీలకు పాల్పడ్డాడు. ఈ ఘరానా ముఠా చేసిన దొంగతనాలు, ముఠా సభ్యుల వివరాలను నిజామాబాద్ సీపీ సాయి చైతన్య కమాండ్ కంట్రోల్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజా వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి ఈ అంతర్ జిల్లా ఘరానా ముఠాను పట్టుకునేందుకు తీవ్రంగా కృషి చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన పాత నేరస్తుడు మహ్మద్ ఆమేర్ నిజామాబాద్ నగరానికి చెందిన పాతనేరస్తులైన మరో ఏడుగురితో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐదు, ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 24 రాత్రి దొంగతనాలకు పాల్పడడంతో పాటు హైదరాబాద్ శివారులోని షాపూర్, జీడిమెట్ల ప్రాంతాల్లో 15 ఆటోలను దొంగిలించినట్లు పేర్కొన్నారు. సదరు పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకుని విచారించి, ఈ ముఠాకు చెందిన మహ్మద్ అబ్దుల్, ఆసిఫ్, వసీం, సోహైల్, జావిద్ ఖాన్, రియాజ్, ఆసీఫ్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ ముఠాకు చెందిన అలీ అలియాస్ బబ్లూ అనే మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

నిందితుల నుంచి 15 తులాల బంగారు నగలతోపాటు కారు, మూడు బైకులను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ముఠాను పట్టుకునేందుకు సౌత్ రూరల్ సీఐ సురేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావ్, సిబ్బంది కృషి చేశారని, ఈ సందర్భంగా వారికి సీపీ చేతుల మీదుగా రివార్డులను అందజేశారు.